# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

గురువారం | 08 అక్టోబరు, 2026 | పేజీలు : 08




# వేయి స్తంభాల దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

### ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాయిని

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : హనుమకొండలోని వేయి స్తంభాల దేవాలయంలో ఈ నెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీ రుద్రేశ్వర దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆవిష్కరించారు. బుధవారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆలయ ఈఓ, ఉత్సవ నిర్వాహకులతో కలిసి పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. చారిత్రక వేయి స్తంభాల దేవాలయంలో దేవీ

తరువాయి 2లో...



# వసతులెలా ఉన్నాయ్?

### ప్రభుత్వ పాఠశాల, కాలేజీలో మౌలిక వసతులు పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

ప్రజాపక్షం/హసన్‌పర్తి : హసన్‌పర్తిలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని వసతులను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి బుధవారం పరిశీలించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, సిసి కెమెరాల పనితీరు, కిచెన్ షెడ్, కిచెన్ గార్డెన్‌లో పెంచుతున్న మొక్కలు, పాఠశాలపై సమావేశాలు, యోగ శిక్షణకు ఏర్పాటు చేసిన షెడ్డును కలెక్టర్ పరిశీలించారు. వాటికి సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి వివరించారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలల్లో అనేక సదుపాయాలను కల్పిస్తుందని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డిఇఒ ఎల్.వి.గిరిరాజ్ గౌడ్, ఎంఇఒ శ్రీనివాస్, స్థానిక తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపిడిఒ సుమన వాణి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో కాంగ్రెస్, బిజెపి మహిళా నేతల బాహాబాహీ

### ఉద్రిక్తతకు దారితీసిన బిజెపి సేవ కళశ యాత్ర
### మోదీ ఫ్లెక్సీ దహనం చేసేందుకు యత్నించిన కాంగ్రెస్ నేతలు
### పోలీస్‌స్టేషన్ ఎదుట బైటాయించిన బిజెపి నేతలు
### పరస్పరం ఫిర్యాదు చేసుకున్న బిజెపి, కాంగ్రెస్ నేతలు
### న్యాయం చేస్తానని హామీనిచ్చిన ఎసిపి రవీందర్‌రెడ్డి

ప్రజాపక్షం / సిద్దిపేట : ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రధాని ప్రజా సేవకు కృతజ్ఞతగా సేవా జ్యోతి కలశ యాత్ర ర్యాలీ జిల్లా కేంద్రంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కాంగ్రెస్, బిజెపి మహిళ నేతలు జుట్టు పట్టుకొని కొట్టు కోవటంతో ఒక్కసారిగా తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరువర్గాలు సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించి బిజెపి, కాంగ్రెస్ నేతలు ఆందోళన చేపట్టారు. పోలీసులు ఇరువర్గాలకు నచ్చ చెప్పి

తరువాయి 2లో...





# సిద్దిపేటలో 151 సెల్‌ఫోన్‌లు రికవరీ

### బాధితులకు అప్పగించిన సిపి రశ్మీపేరుమాళ్



7

# జర్నలిజంపై జులుం నడవదు



2

# వేయి స్తంభాల దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

(మొదటిపేజీ తరువాయి)

శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ నాయకులు కోన శ్రీకర్, పల్లం రమేష్, తౌటిరెడ్డి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ పాఠశాల, గురుకులాలు పచ్చదనం, పరిశుభ్రంతో విలసిల్లాలి

కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నదని... జిల్లాలో అన్నీ పాఠశాలలు, కళాశాలలు పచ్చదనం, పరిశుభ్రంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. జిల్లాలోని అన్నీ సంక్షేమ, గురుకుల పాఠశాల, కళాశాల ఆవరణలో ఎలాంటి చెత్త చెదారం, పిచ్చి మొక్కలు లేకుండా చేయాలన్న కలెక్టర్ ఆదేశాల మేరకు గత వారం రోజుల నుండి అన్నీ సంక్షేమ శాఖల అధికారులు, స్పెషల్ అధికారులు వారి పరిధిలో గల సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాల లలో పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. గురుకులాల్లో, పాఠశాలల్లో ఇలాంటి పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం ద్వారా విద్యార్థులు సీజనల్ వ్యాధుల (డెంగ్యూ, మలేరియా) బారిన పడకుండా ఆరోగ్యంగా విద్యాభ్యాసం కొనసాగించగలుగుతారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# జర్నలిజంపై జులుం నడవదు

ప్రజాపక్షం/ఖిలా వరంగల్ : జర్నలిస్టులపై దౌర్జన్యానికి పాల్పడితే సహించేది లేదని వరంగల్ తూర్పు పరపతి సంఘం అధ్యక్షుడు నరేందర్ హెచ్చరించారు. ఓ మీడియా సంస్థ దిష్టిబొమ్మ దహనాన్ని నిరసిస్తూ వరంగల్ పోచమ్మమైదాన్ కూడలిలో జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ప్రశ్నించే నాలుగవ స్తంభంపై ఎంఎల్ఏ అనుచరులు దౌర్జన్యానికి దిగడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్ధన్నపేట ఎంఎల్ఏ కెఆర్ నాగరాజు ఘటనపై వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు ఇప్పటికే నాలుగుసార్లు చోటు చేసుకున్నాయని నరేందర్ ఆరోపించారు. వార్తలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధమైన మార్గాలను ఆశ్రయించాలి ఉండగా, దిష్టిబొమ్మలు దహనం చేయడం ప్రజాస్వామ్య సంప్రదాయం కాదని జర్నలిస్టు సంఘాల నాయకులు పేర్కొన్నారు. జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఎంఎల్ఏ క్షమాపణ చెప్పే వరకు నిరసనలు కొనసాగిస్తామని ఆందోళనకారులు స్పష్టం చేశారు.

# సిద్దిపేటలో కాంగ్రెస్, బిజెపి మహిళా నేతల బాహాబాహీ

(మొదటిపేజీ తరువాయి)

న్యాయం చేస్తామని హామీనివ్వటంతో పరిస్థితి సద్దుమణిగింది. సంఘటన వివరాల్లోకి వెళ్లితే.. బిజెపి ఆధ్వర్యంలో చేపట్టిన సేవా జ్యోతి కలశయాత్ర కొండ భూదేవి గార్డెన్ నుండి బయలు దేరి పట్టణంలోని మెయిన్‌రోడ్డు మీదుగా సాగుతూ గాంధీ చౌక్ వద్దకు చేరుకొంది. ఇదే క్రమంలో అక్కడ ఉన్న ఎన్ఎస్‌యుఐ, మహిళ కాంగ్రెస్ నేతలు, పార్టీ శ్రేణులు ఢిల్లీలో రాహుల్‌గాంధీ అరెస్టును నిరసిస్తూ ప్రధాని మోదీ ప్లెక్సీని దహనం చేసేందుకు యత్నించగా గమనించి బిజెపి శ్రేణులు అడ్డుకునే యత్నం చేశారు. బిజెపికి చెంది మహిళ నేతలు కాంగ్రెస్ మహిళ నేతలపై దాడి చేశారు. ఇద్దరు జుట్టుపట్టుకొని పరస్పరం దాడిచేసుకున్నారు. బిజెపి నేతలు ఎక్కువగా ఉండటంపై కాంగ్రెస్ నేతలపై దాడి చేశారు. పోలీసులు అడ్డుకునే యత్నం చేసినప్పటికి అప్పటికే వరుసగా దాడులు జరిగాయి. పోలీసులు అడ్డుకొని వారిని సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తాము శాంతియుతంగా సేవా జ్యోతి కళశయాత్ర నిర్వహిస్తుండగా మహిళ కాంగ్రెస్ నేతలు ప్రధాని మోదీ ఫ్లెక్సీని దగ్ధం చేసేందుకు యత్నించటంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. మహిళ కాంగ్రెస్ నేతలపై చర్యలు తీసుకోవాలని బిజెపి నేతలు పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో మహిళ కాంగ్రెస్ నేతలపై దాడి తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బాధితులను పరామర్శించారు. తన కార్యకర్తలు, నాయకులపై బిజెపి నేతలు దాడి చేశారని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిద్దిపేట ఏసిపి రవీందర్‌రెడ్డి వచ్చి సంఘటనపై సమగ్రంగా విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని హామీనివ్వటంతో ఇరువర్గాలు బిజెపి, కాంగ్రెస్ నేతలు ఆందోళన విరమించారు.

# తాగునీటి కోసం నిధులు మంజూరు చేయాలని వినతి



ప్రజాపక్షం/కమలాపూర్ : తాగునీటి సమస్యల పరిష్కారానికి హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబు ఆదేశాలతో కమలాపూర్ మండలానికి ఆర్‌డబ్ల్యూఎస్ నిధుల క్రింద కోటి రూపాయలు మంజూరు చేయాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ కి కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ తొటం ఝాన్సీ రాణి రవీందర్ వినతి పత్రాన్ని అందజేశారు. కమలాపూర్ మండలం కేంద్రంతో పాటు మండలంలోని 23 గ్రామాలలో త్రాగునీటికి సంబంధించి పైపు లైనులు, బోర్ మోటార్స్, సైడ్ డ్రైనేజీల పనుల నిమిత్తం మండల సర్వసభ్య సమావేశంలో మండలంలోని గ్రామ సర్పంచుల అభ్యర్థన మేరకు నిధుల మంజూరికై వొడితల ప్రణవ్ బాబు దృష్టికి తీసుకెళ్ళగా, వారి ప్రతిపాదనతో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఝాన్సీ రాణి హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బజ్పాయ్ ని కలిసి తక్షణమే కోటి రూపాయల నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాణి మాట్లాడుతూ... ప్రజల సమస్యలు పరిష్కరించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం, నియోజకవర్గ ఇంచార్జీ ప్రణవ్ బాబు ఎల్లప్పుడూ ముందుంటారని అన్నారు. త్వరలోనే నిధులు మంజూరు అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పోషణతోనే సంపూర్ణ ఆరోగ్యం



ప్రజాపక్షం/టేకుమట్ల : మండలంలోని వెలిశాల గ్రామంలో బుధవారం సర్పంచ్ బొద్దు తిరుపతి అధ్యక్షతన పోషణ మాస కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ మాధవి 9వ పోషణ మాస కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మన అంగన్‌వాడీ మన బాధ్యత అనే కార్యక్రమంలో తల్లులకు పోషణ అవసరం పిల్లల వయస్సుకు తగ్గ బరువు, ఎత్తుకు తగిన బరువు ఉన్నప్పుడే వాళ్ల శారీరకంగా, మానసికంగా ఎదుగుదల ఉంటుందని పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే గుడ్లు, ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలు, పప్పు దినుసులు ఎక్కువగా పిల్లలకు పెట్టి ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలని తల్లులకు, గర్భిణీలకు, బాలింతలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. గర్భస్థ దశ నుండి చిన్నారికి రెండేళ్ల వయసు వచ్చే వరకు తొలి వెయ్యి రోజుల ప్రాముఖ్యతను వివరించారు. మూడు నుండి ఆరేళ్లలోపు పిల్లలను క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తెలిపారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ అంగన్‌వాడీ కేంద్రాన్ని మన అంగన్‌వాడీ మన బాధ్యతగా భావించి చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూపర్‌వైజర్ మాధవి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అఫ్జల్, ఇన్‌చార్జి హెచ్‌ఎం గిరిబాబు, ఏఎన్ఎం సంగీత, అంగన్‌వాడీ టీచర్లు ఉమాదేవి, సునీత, స్వప్న, ఆశా వర్కర్లు, గర్భిణీలు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై కల్వర్ట్ పనులు



ఏడు రోజుల్లో కల్వర్టు పనులు పూర్తయ్యే అవకాశం ఉందన్న సిబ్బంది

ప్రజాపక్షం/రఘునాథపల్లి : మండల కేంద్రంలోని ఆర్వీఎస్ కాంప్లెక్స్ ఎదు రుగా హన్మకొండ హైదరాబాద్ (ఎన్‌హెచ్ 163 )జాతీయ రహదారిపై కల్వర్టు పనులు మంగళవారం నేషనల్ హైవే అధికారులు ప్రారంభించారు. దింతో జాతీయ రహదారి బ్రిడ్జిపై నుండి రాత్రి సమయంలో ప్రయాణించే వాహన దారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి భద్రత ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని జాతీయ రహదారి కిరువైపులా సర్వీస్ రోడ్డుపై వాహనదారులు వెళ్లే విధంగా సూచిక బోర్డులను నేషనల్ హై వే అధికారులు ఏర్పాటు చేయడం జరిగింది.వర్షాలు పడ్డ సమయంలో మండల కేంద్రం లోని ఆర్వీఎస్ కాంప్లెక్స్ దగ్గర సర్వీస్ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పైప్ లైన్ గుండా నీరు వెళ్లకపోవడంతో, ఆ నీరంతా జాతీయ రహదారిపై నిలిచి వాహన దారులు ప్రమాదాలకు గురవు తున్న దృష్ట్యా, భవిష్యత్తులో జాతీయ రహదారిపై వర్షపు నీరు నిలువకుండా నేషనల్ హైవే అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా రహదారిపై బాక్స్ కల్వర్టు పనులు చేప ట్టడం జరుగుతుందని సిబ్బంది తెలిపారు. ఏడు రోజుల్లో జాతీ య రహదారిపై కల్వర్టు పనులు పూర్తిచేసి వాహనదారు లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాఫీగా ప్రయాణం సాగించేలా పనులు పూర్తి చేస్తామని వారు తెలిపారు. సర్వీస్ రోడ్డుపై వాహనాల రద్దీ పెరిగిన దృష్ట్యా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని స్థానిక పోలీసులు విజ్ఞప్తి చేశారు. అదే విధంగా సర్వీసు రోడ్డు కిరువైపులా గల దుకాణ యజమానులు వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని షాపుల ముందు వాహనాలు పార్కింగ్ చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు కోరారు. సర్వీస్ రోడ్డు కిరు వైపులా మిగతా కల్వర్టు పనులు జనం రద్దీని దృష్టిలో ఉంచుకొని దసరా పండుగ అనంతరం మొదలు పెట్టి పూర్తి చేయనున్నట్లు వారు తెలిపారు.



# సిసి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాపక్షం/లింగాలఘణపురం : స్టేషన్ ఘణపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి ఆదేశాల మేరకు, మండలంలోని రామచంద్ర గూడెం గ్రామంలో బొడ్రాయి వద్ద సిసి రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ సాయి రెడ్డి మల్లారెడ్డి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, స్టేషన్ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవతో గ్రామాల అభివృద్ధి చెందుతున్నాయని వారు ధీమా వ్యక్తం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్న వ్యక్తి కడియం శ్రీహరి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు సిరిసనగండ్ల రాజు, ఐదవ వార్డ్ మెంబర్ కొత్త శివారెడ్డి 1వ వార్డు మెంబర్ నెల్లుట్ల అందాలు రెండవ వార్డ్ మెంబర్ కుమ్మరి కుంట్ల లావణ్య గ్రామ శాఖ ఉపాధ్యక్షులు గంగుల తిరుపతిరెడ్డి సాయి రెడ్డి, రామిరెడ్డి కొత్త జనార్దన్ రెడ్డి జోలం యాదగిరి నెల్లుట్ల శంకరయ్య, చొప్పరి నర్సయ్య కొత్త విశ్వేశ్వర్ రెడ్డి బీరం లక్ష్మారెడ్డి, డి.రాజు గ్రామ పెద్దలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మూడో వార్డులో డ్రైనేజీ, రోడ్ల పరిశీలన

ప్రజాపక్షం/జనగామ టౌన్: పట్టణంలోని మూడో వార్డులో డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కౌన్సిలర్ బూడిద జ్యోతి కోరారు. మున్సిపల్ ఏఈ సత్యమూర్తితో కలిసి బాలాజీనగర్, ఏకశిల కాలనీ తదితర ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమస్యలపై ప్రతిపాదనలు సిద్ధం చేసి చైర్‌పర్సన్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బూడిద గోపి, కాలనీవాసులు శ్రీనివాస్, ఎండీ నజీమా, శశిరేఖ, శ్రీధర్, భాగ్య రాజు, మున్సిపల్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, భరత్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

ప్రజాపక్షం/దేవరుప్పుల: అప్పిరెడ్డి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ దేవరుప్పుల సహకారంతో దుగ్గింపూడి కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.20వేల విలువైన బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనూష నరసింగరావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు ఉప్పుల్ రెడ్డి, బాధ్యులు అశోక్ రెడ్డి, పట్టాభిరాం రెడ్డి, రామచంద్రారెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు నవీన్ కుమార్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

# పేదల కలను సాకారం

మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కళ్యాణి



ప్రజాపక్షం/ మంగపేట : ఇందిరమ్మ ఇల్లు అంటే.. పేద కుటుంబానికి భరోసా..! సొంతింటి గడప అంటే.. ఆ కుటుంబానికి కొత్త భవిష్యత్తు పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అని ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కళ్యాణి అన్నారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ పటేల్ సూచనల మేరకు బుధవారం మంగపేట మండలం పూరేడుపల్లి గ్రామంలో సింగ నరసింగరావు స్వరూప ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి హాజరైన ములుగు జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా రేగ కళ్యాణి మాట్లాడుతూ పేదల సొంతింటి కలలు కేవలం హామీగా కాకుండా ఆచరణలో సహకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం. అర్హులైన ప్రతి కుటుంబానికి గూడు కల్పించాలని లక్ష్యంతో మన మంత్రి సీతక్క నాయకత్వంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ముందుకు సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ నెంబర్ పాయం అనిత, ములుగు మార్కెట్ డైరెక్టర్ కొమరం బాలన్న, ఏటునాగారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు భాగ్య, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బిల్లాటి నరేష్, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు కబ్బాక లక్ష్మణ్, మంగపేట యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ భూక్యకుమార్, మండల సీనియర్ నాయకులు పొదెం నాగేశ్వర రావు, గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్.కె అజ్మత్, యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు తులం నాగబాబు పాల్గొన్నారు.

## పోటీల్లో సెయింట్ ఫ్రాన్సిస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాపక్షం/వేలేరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా థాంగ్‌తా పోటీలలో వేలేరు సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాల విద్యార్థులు 6వ తరగతి విద్యార్థి రిషికాంత్,8వ తరగతి విద్యార్థి జీవన్,9వ తరగతి విద్యార్థి నెహేమియా పాల్ లు వివిధ వేయిట్ విభాగాల్లో పోటీ పడి ద్వితీయ స్థానాలు సాధించినట్లు కోచ్ సిరిగిరి సాంబశివ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫాదర్ కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

## విద్యుత్ కోతలతో రైతుల ఆగ్రహం

ప్రజాపక్షం/నెక్కొండ : వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ నెక్కొండ మండలం రెడ్లవాడ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. తరచూ విద్యుత్ కోతలతో పంటలకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనకు బిఆర్ఎస్ నాయకులు మద్దతు ప్రకటించి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి, తెలంగాణ పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యుడు గటిక అజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన సమయంలో విద్యుత్ అందకపోతే పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని, కోతలను తక్షణమే నివారించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండలాధ్యక్షుడు మాజీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రాజిరెడ్డి, రెడ్లవాడ సర్పంచ్ దగ్గు గాంధీ, మాజీ సర్పంచ్‌లు, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, రైతులు, పాల్గొన్నారు.

## శారదాదేవి శరన్నవరాత్రి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/ఖిలా వరంగల్ : నగరంలోని 39వ డివిజన్ కాశీకుంట కరీమాబాద్‌లోని శ్రీ లలితా మహాత్రిపుర సుందరి కామేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం శ్రీ శారదాదేవి శరన్నవరాత్రి మహోత్సవాల కరపత్రం, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి చిలుకలూరి హరీష్‌శర్మ మాట్లాడుతూ ఏటా నిర్వహిస్తున్నట్లుగానే ఈ ఏడాది కూడా శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 11 నుండి 20వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఉత్సవాల నిర్వహణకు భక్తులు, స్థానికులు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకురాలు అడవాల లక్ష్మీ మాతాజీ, అభివృద్ధి కమిటీ సభ్యులు గీతాదేవి, పుష్పలత, పద్మావతి, విజయలక్ష్మి, వసంత, ఉమాదేవి, లలిత, కళ్యాణి, సంధ్యారాణి, పాల్గొన్నారు.

## నైపుణ్యాలను ప్రోత్సహించడమే కౌశల్ బోధ లక్ష్యం

### జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. గిరిరాజు గౌడ్



ప్రజాపక్షం/హసన్‌పర్తి: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించి, వాటిని ప్రోత్సహించడం ద్వారా వారు ఆత్మగౌరవంతో జీవించేందుకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చని హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. గిరిరాజు గౌడ్ ఉపాధ్యాయులకు సూచించారు.హసన్‌పర్తి మండలంలోని స్కిల్ స్టార్స్ ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కౌశల్ బోధ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాస్‌తో కలిసి పాల్గొన్న డీఈఓ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిలోనూఏదో ఒక ప్రత్యేక నైపుణ్యం ఉంటుందని, ఉపాధ్యాయులు వాటిని నిశితంగాగమనించిగుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల నైపుణ్యాలను గుర్తించడం, వాటిని అభివృద్ధి చేయడం, భవిష్యత్తులో జీవనోపాధికి అనుసంధానం చేసే విధంగా తగిన శిక్షణ అందించడం కౌశల్ బోధ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని డీఈఓ వివరించారు.ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశంసా పత్రాలు, పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టిఆర్‌పి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణకు సన్మానం



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : మున్నూరు కాపు పరపతి సంఘం పద్మాక్షి రోడ్ భవనంలో బుధవారం పూజారి సత్యనారాయణ తెలంగాణ రాజ్యాధికార పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా పదవి లభించినందున మున్నూరు కాపు సంఘ పక్షాన సన్మానించారు. హనుమకొండ జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కనుకుంట్ల రవికుమార్ ఆధ్వర్యంలోఈ యొక్క సన్మానం ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కనుకుంట్ల రవికుమార్ మాట్లాడుతూ పూజారి సత్యనారాయణ ఎంతోఓగా రిటైర్డ్ అయి రాజకీయాలలో పాల్గొంటూ బీసీ ల కోసం సేవ చేయాలనే సంకల్పంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేయడం జరిగిందని, హనుమకొండ జిల్లా అధ్యక్షునిగా పదవి లభించిందని, ఇలాగే మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని, బీసీలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ వారు హనుమకొండ జిల్లాకు మరిన్ని సేవలు అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు కర్రు వెంకటేశ్వర్లు, అంబటి నరేందర్, తోట కనక రాములు, అంబటి కుమారస్వామి, మిద్దెల బాబు, తోట ప్రకాష్, చింతపట్ల సాంబయ్య, బొల్లం అశోక్, బండారి మహేందర్, గందె మధు, కర్రు మనోజ్ కుమార్, కనుకుంట్ల శ్రీనివాస్, షేర్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## చౌటుపర్తి ఫీల్డ్ అసిస్టెంట్ మొగిలి మృతి

### నివాళులర్పించిన ఎంపిడిఓ,ఎపిఓ,ఇసి,ఫీల్డ్ అసిస్టెంట్లు



ప్రజాపక్షం/నడికూడ : హనుమకొండ జిల్లా నడికూడ మండలం చౌటుపర్తి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మొగిలి విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం రాత్రి మస్టర్ డిమాండ్ నమోదు చేస్తున్న సమయంలో అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఆయన మృతి చెందినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న నడికూడ మండల ఎంపీడీవో రామకృష్ణ, ఏపీవో విద్యావతి,ఈసీ రజనీకాంత్‌తో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు మొగిలి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాతోపాటు డ్యూటీ చేస్తూ,అందరితో ప్రేమగా మాట్లాడుతూ ఆప్యాయంగా పలకరించే మొగిలి మా మధ్య లేకపోవడం బాధాకరమని తన జ్ఞాపకాలు మా హృదయాలలో ఎప్పుడు ఉంటాయని మమ్మల్ని వదిలి వెళ్లావా మొగిలి అన్న అంటూ,ఫీల్డ్ అసిస్టెంట్లు కంటతడితో ఆవేదన వ్యక్తం చేశారు.

## ఐఎఎస్ అకాడమీ వరంగల్ బ్రాంచ్ పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ : పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే సరైన అకాడమిక్ అప్రోచ్, విషయ పరిజ్ఞానం, నిరంతర సాధన ఎంతో అవసరమని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్, సమీక్ష ఐఏఎస్ అకాడమీ చీఫ్ అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ సి. గణేష్ అన్నారు.ప్రొఫెసర్ పి. కృష్ణమాచారి అధ్యక్షతన హన్మకొండలోని వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో సమీక్ష ఐఏఎస్ అకాడమీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో బుధవారం యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్, టీజీపీఎస్సీ గ్రూప్1, గ్రూప్2 తదితర పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రొఫెసర్ సి. గణేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ సి. గణేష్ యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షకు సంబంధించిన కోర్ సబ్జెక్టులు, వాటి ప్రాధాన్యత, ప్రతి సబ్జెక్టుకు సంబంధించిన ప్రామాణిక పుస్తకాల గురించి వివరించారు. సబ్జెక్టులపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, సరైన పుస్తకాలను ఎంపిక చేసుకుని క్రమపద్ధతిలో చదవాలని సూచించారు. ప్రణాళికాబద్ధమైన చదువు, నిరంతర సాధనతో మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. సందర్భంగా సమీక్ష ఐఏఎస్ అకాడమీ వరంగల్ బ్రాంచ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ ఈసీ సభ్యుడు, నియామకాల విభాగం డైరెక్టర్ డాక్టర్ చిర్ర రాజు,డాక్టర్ ఎ. శేషాచలం, సమీక్ష ఐఏఎస్ అకాడమీ ఫౌండర్ గంటా అనిల్ , నటరాజ్ , వాసు, ప్రవీణ్ , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్లంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సామాజిక వేత్త, ఓటర్ చైతన్య పోరాట యోధులు నిమ్మల శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, సమాజం పట్ల బాధ్యత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ తన ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఓటరుగా నమోదు చేసుకోకపోతే ఎన్నికల సమయంలో తమ అభిప్రాయాన్ని ఓటు రూపంలో వ్యక్తం చేసే అవకాశం కోల్పోయే పరిస్థితి ఉంటుందని పేర్కొన్నారు. కేవలం ఓటు హక్కు కలిగి ఉండటమే కాకుండా, ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలని సూచించారు."అందరూ ఓటేయాలి.. అందులో మనం ఉండా లి" అనే నినాదంతో గ్రాడ్యుయేట్లలో ఓటరు చైతన్యం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## స్నేహితుడి అంత్యక్రియల కోసం రూ.50,000 అందజేత

ప్రజాపక్షం/వెంకటాపూర్ (రామప్ప): మనిషి చనిపోతే దగ్గరికి కనీసం చూసి పోవడానికి కూడా ఇష్టపడని రోజులలో ఆర్థిక సంగతులు బాగా లేక తీవ్ర అనారోగ్యంతో సహచర స్నేహితుడు మృతి చెందడంతో తీవ్ర మనోవేదనకు గురైన పదవ తరగతి బ్యాచ్ కి చెందిన స్నేహితులు తోటి సహచర స్నేహితుడు అప్పాల రాజుకి దహన సంస్కారాల కార్యక్రమాల కోసం రూ.50 వేలు సహాయాన్ని అందించి స్నేహమేరా జీవితం అని నిరూపించుకున్నారు.అత్యంత పేద కుటుంబం అయిన రాజు కుటుంబాన్ని చూసి అతని 1996–97 బ్యాచ్ చెందిన స్నేహితులు మానవత దృక్పథంతో తక్షణం సహాయంగా రాజు అంత్యక్రియల కోసం అక్షరాల 50 వేల రూపాయలు ఇచ్చి ఆపదలో ఉన్న కుటుంబాన్ని మనోధైర్యం కల్పిస్తూ ఆ కుటుంబానికి అండగా నిలిచారు. కాగా రాజుకు కుమారులు లేకపోవడంతో పెద్ద కుమార్తె జోత్స్న అంత్యక్రియలు నిర్వహించారు.

## ఆరోగ్యం, పోషకాహార అవగాహన కార్యక్రమం

ప్రజాపక్షం/హసన్ పర్తి: హనుమ కొండ జిల్లా హసన్ మండలం ఎస్ ఆర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్‌ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ ఎస్ ఎస్ ప్రత్యేక శిబిరం 2026–2027లో భాగంగా 3వ రోజు ఆరోగ్యం, పోషకాహార అవగాహన కార్యక్రమాన్ని బుధవారం హసన్ పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలోని జెడ్ పిహెచ్ ఎస్ ప్రభుత్వఉన్నతపాఠశాలలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు గ్రామ ప్రజలకు సమతుల్యఆహారం,పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లు, పరిసరాల పరిశుభ్రత, వ్యాధులనివారణ ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి అవగాహన కల్పించారు. ఎల్లాపూర్ గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు సహకరించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సమాజ సేవ సామాజిక బాధ్యత పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు.నేను కాదు – నువ్వు అనే ఎన్ ఎస్ఎస్ నినాదానికి అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగానిర్వహించారు.

## బాటను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/వేలేరు : తమవ్యవసాయ భూములకు వెళ్లే పాత బాటను పీచర గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని పీచర గ్రామానికి చెందిన రైతులు జి.ఈశోక్‌రావు, వి.వీరబ్రహ్మం,వి.వెంకటేశ్వర్లు,గద్ద రాజేశ్వర్,బి కట్ట య్య, వి.ఈశ్వరయ్య,కొయ్యడ మల్లయ్య, వెంకటయ్య, రమేష్, రమణ, చంద్రయ్య,విజయ్‌కుమార్ తదితరులు ఆరోపిస్తున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పీచర గ్రామశివారులోని అవులోని కుంట పెద్దచెరువు సమ సమీపంలోని వ్యవసాయ భూములకు వెళ్లేందుకు బాట ఉందని ఈబాట గుండా దాదాపుగా గత 40 సంవత్సరాలుగా వ్యవసాయ బావులవద్దకు వ్యవసాయ పనులకు రాకపోకలు సాగిస్తున్నామని తెలిపారు. బాటలో ఆటంకం కలిగిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.ఎస్సై దిలీప్ వివరాల ప్రకారం పీచర గ్రామానికి చెందిన కొందరు రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతోందని తెలిపారు.

## కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే మాధవరెడ్డి

ప్రజాపక్షం/నెక్కొండ : మండలంలో ఇటీవల మృతి చెందిన, రోడ్డు ప్రమాదంలో గాయపడిన కుటుంబాలను నర్సంపేట ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి పరామర్శించారు. బడి తండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు ధరంసోత్ సూర్య అత్త బాదావత్ అమ్లీ మృతి చెందడంతో వారి నివాసానికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే రెడ్లవాడ సొసైటీ డైరెక్టర్ బాధావత్ వెంకట్ రామ్ రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో ఆయన నివాసానికి వెళ్ళి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లావుడ్యా తిరుపతి, రెడ్లవాడ పిఏసిఎస్ చైర్మన్ ఆవుల శ్రీనివాస్, నెక్కొండ పట్టణ అధ్యక్షుడు ఈదునూరి సాయికృష్ణ, ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/కాటారం :** మండలంలోని రేగుల గూడెం గ్రామానికి చెందిన జాడి సారమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని నేతకాని సేవా ఫౌండేషన్ సభ్యులు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన 11వ రోజు కార్యక్రమంలో పాల్గొని జాడి సారమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేసారు. ఈ సందర్భంగా నేతకాని సేవా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే లక్ష్యంగా నేతకాని ఫౌండేషన్ పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కుమ్మరి అశోక్, గంట దేవదాస్, కొండగొర్ల రామ్‌నారాయణ, గోగుల రాజేష్, గాలి సడవలి, బీరెల్లి చిన్న రాజయ్య, గజ్జల రాజేందర్, గోమాస మధూకర్, బీరెల్లి కరుణాకర్, బీరెల్లి మహేష్, కొండ తిరుపతి, గంట సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘం భవనానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండలంలోని అప్పయ్యపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ ఎలుకపల్లి రమేష్ ఆధ్వర్యంలో మహిళా సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. విబిజి రామ్ ఫండ్స్ ద్వారా రూ.10లక్షల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. మహిళా సంఘం సభ్యులకు సొంత భవనం ఉండడం వలన సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సర్పంచ్ రమేష్ తెలిపారు.



## జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భారత విద్యార్థి ఫడరేషన్ (ఎస్ఎఫ్ఐ) భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆలిండియా కమిటీ పిలుపులో భాగంగా సర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని, అదేవిధంగా ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా సెంటర్లో నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా వారు మాట్లాడి ద్వారా ప్రతి పక్షాలకు అనుకూలంగా ఉన్న ఓట్లు తొలగిస్తున్నారని అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్వర్ తీరుపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. తక్షణమే ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అఖిల్, అజయ్, విష్ణు, ఎస్ఎఫ్ఐ సంఘమిత్ర డిగ్రీ కాలేజ్ కమిటీ సభ్యులు సాయి కృష్ణ, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.



# పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**ప్రజాపక్షం/మహాదేవపూర్ :** పోషకాహార లోపాన్ని నివారిచి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా గ్రందాలయ చైర్మెన్ కోట రాజబాబు, అధికారులు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సిడిపిఓ రాధికా రెడ్డి ఆధ్వర్యంలో పాషణమాసం కార్యమ్రాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం ప్రాముఖ్యత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, సమతుల్య ఆహారం వలల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. స్థానికంగా లభించే పోషక విలువలు కలిగిన ఆహర పదార్థాలను నిత్య జీవితంలో వినయోగించాలని సూచించారు. వివిధ రకాల పక్షషకాహర పదార్థాలను ప్రదర్శించి వాలి పక్షషక విలువలను వివరించారు. అనంతరం 12 చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహిచారు.అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పక్షషణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో చురుకుగా పాల్గొన్న పక్షషణ చాంపియన్లకు మెమొంటోలు అందజేసారు. పిల్లల ఆరోగ్యం ,పోషణ, సమగ్ర అభివృద్ధికి కుటుంబ సభ్యులు,అంగన్వాడీ సిబ్బంది , అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాటారం మార్కెట్ కమిటీ చైర్మెన్ పంతకాని తిరుమల సమ్మయ్య, పిఏసిఎస్ చైర్మెన్ చల్ల తిరుపతి రెడ్డి, పలిమెల మండల తహసీల్దార్, ఎంపిడిఓ, మెడికల్ ఆఫీసర్, సూపర్వైజర్లు, పక్షషణ అభియాన్ డీసీ,బీసీ, ప్రథమ్ మాస్టర్ ట్రైనర్, అంగన్వాడీ టీచర్లు,హెల్పర్లు,లబ్దిదారులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌లోకి బిజెపి, బిఆర్ఎస్ నేతల చేరికలు

**ప్రజాపక్షం/చిట్యాల:** మండలంలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన బిజెపి, బిఆర్ఎస్ నాయకులు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొడవటంచ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ సన్నిధిలో ఎంఎల్ఏ గండ్ర సత్యనారాయణరావు సమక్షంలో బుధవారం కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. ఎంఎల్ఏ వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బిజెపి గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపగాని స్వామి, నాయకులు కంచర్ల శ్రీనివాస్, గోలకొండ విజేందర్, బిఆర్ఎస్ మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, ప్రస్తుత ఉపాధ్యక్షుడు గోపగాని శ్రీనివాస్, సీనియర్ నాయకులు గోపగాని శివరాములు, ఎస్‌సి సెల్ నాయకులు ఎలగొండ శంకర్, చెన్నమల్ల మొగిలి, బిసి సెల్ నాయకులు ఆరెల్లి సంతోష్, అనుముల రవి, గజ్జి నరేష్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ కాంగ్రెస్‌లో చేరిన నాయకులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దబ్బెట అనిల్, మాజీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, గ్రామ కమిటీ అధ్యక్షుడు గజ్జి రవి, సర్పంచ్ జన్నే సురేష్, వార్డు సభ్యుడు కంచు బిక్షపతి, యూత్ అధ్యక్షుడు కంచర్ల రాంబాబు, మురహరి బాను చందర్, చేన్న నిశాంత్, బాలుగ నీలేష్, గోపగాని వెంకటేశ్వర్లు, గోపగాని శివ, నీరటి నారాయణ, నాగిరెడ్డి శంకర్, గోనె కొమురయ్య, గోలకొండ పైడయ్య, నాయకులు కొర్రి అశోక్, అంగడి రాయమల్లు, తదితరులు పాల్గొన్నారు.



# చట్ట బద్ధంగా ఇసుక రవాణా జరగాలి

### తహసీల్దారుకు బిఆర్ఎస్ మండల నాయకుల వినతి

**ప్రజాపక్షం/టేకుమట్ల :** టేకుమట్ల మండల పరిధిలోని చలివాగు, మానేరు వాగుల నుండి జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు, ఇతర మండలాలు, జిల్లాలకు జరుగుతున్న ఇసుక రవాణాను వెంటనే అరికట్టాలని బిఆర్ఎస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు టేరకు తహసీల్దారు స్వరూప రాణి కలిసి వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని వాగుల నుండి లభించే ఇసుకను ముందుగా ఈ మండల ప్రజల అవసరాలకు మాత్రమే అందుబాటులో ఉంచాలని, మండల కేంద్రం నుండి ఇతర మండలాలు, ఇతర జిల్లాలకు అక్రమంగా ఇసుక తరలించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం కారణంగా భవిష్యత్తులో వర్షపాతం తగ్గే అవకాశం ఉండడంతో నీటి వనరులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. వాగుల్లో ఇసుకను అధికంగా తొలగించడం వలన భూగర్భ జలాల స్థాయి పడిపోయి, వేసవి కాలంలో బోర్లు, బావుల్లో నీటి లభ్యంత తగ్గే ప్రమాదం ఉందన్నారు. దీనివలన వేసంగి పంటలకు నీటి కొరత ఏర్పడి రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువలన చలివాగు, మానేరు వాగుల నుండి ఇసుక తవ్వకం, రవాణాపై అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి, అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టాలని బిఆర్ఎస్ నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సట్ల రవి గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, మండల ముఖ్య నాయకులు బందెల నరేష్, పింగిలి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ మాట్ల శ్రీనివాస్, టౌన్ ప్రెసిడెంట్ నిమ్మల స్వామిలు పాల్గొన్నారు.




# రాజ్యాంగ పరిరక్షణ కోసం అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో పాదయాత్ర

### డిసిసి అధ్యక్షులు బట్టు కరుణాకర్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఇండియా కూటమి ఆధ్వర్యంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, టీజేఎస్, సీపీఐ(ఎంఎల్) పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో నేడు గురువారం నాడు భూపాలపల్లి జిల్లా కేంద్రంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టబోతున్నామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బట్టు కర్ణాకర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సోతుకు ప్రవీణ్ కుమార్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కిరణ్, సిపిఎం జిల్లా నాయకులు ఆకుదారి రమేష్ లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ ఓటు హక్కును పరిరక్షించాలని, అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని, ఫారం6లో తీసుకొచ్చిన మార్పులపై స్పష్టత ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని కోరారు. హనుమాన్ టెంపుల్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు పాదయాత్ర నిర్వహించినట్లు తెలిపారు. ఇండియా కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దాట్ల శ్రీనివాస్, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం నాయకులు నేరెళ్ల జోసెఫ్, అఖిల్ కిషోర్ నాగరాజు కోనూరి భగత్, మరాఠీ కాంతారావు, పోతుల పవన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## మహనీయుడు ఎస్.ఆర్.శంకరన్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** పేదలు, ఆదివాసీలు, దళితులు, అణగారిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మానవతావాది, మాజీ ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్. శంకరన్ అని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్ కొనియాడారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుందరయ్య నగర్ మల్లు స్వరాజ్యం ఆఫీస్‌లో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం, కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం.రాజేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పోలం.చిన్న రాజేందర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎస్.ఆర్.శంకరన్ ప్రభుత్వ అధికారిగా పనిచేసిన కాలంలో పేదలు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల సమస్యలను అత్యంత సున్నితంగా అర్థం చేసుకుని, వారి హక్కుల పరిరక్షణ కోసం కృషి చేశారని అన్నారు. ముఖ్యంగా ఆదివాసీల భూమి, విద్య, ఉపాధి, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు పూర్తిస్థాయిలో అమలు కావాలని, గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, సాగునీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపడాలని ఆయన ఆశయాలకు అనుగుణంగా ఉద్యమాలను కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మేకల మహేందర్, సిహెచ్ రవికుమార్, సునీత, కోట జ్ఞానేశ్వరి, మెతుకు స్రవంతి, గట్టు శంకర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తుల్లో జాప్యాన్ని నివారించాలి

### ఎంసి చైర్మెన్ పంతకాని తిరుమల సమ్మయ్య

**ప్రజాపక్షం/కాటారం :** ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తుల్లో జాప్యాన్ని నివారించి వారంలోగా రైతుల విద్యుత్ సమస్యను పరిశ్కరించాలని కాటారం మార్కెట్ కమిటీ చైర్మెన్ పంతకాని తిరుమల సమ్మయ్య అన్నారు.బుధవారం మండలకేంద్రంలోని కేంద్రంలోని ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ సెంటర్‌ను సందర్శించారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తుల్లో జాప్యం జరుగుతుందని రైతుల ద్వారా వచ్చిన ఫిర్యాదుల మేరకు రిపేరింగ కేంద్రాన్ని పందర్శించి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యను త్వరగా పరిశ్కరించాలని రైతుల వద్ద ఎలాంటి రుసుము వసూలు చేయరాదని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు రైతులకు ఇబ్బందుల లేకుండా ప్రత్యేక చొరవతో రిపేరింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసారని అన్నారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ డీఈతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిశ్కరించాలని కోరారు.వారంలోగా పరైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా అన్నిరకాల చర్యలు చేపట్టాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధి పంతకాని సమ్మయ్య,ఏఎంసి డైరెక్టర్ పిల్లమరి రమేష్,మండల ప్రచార కమిటీ చైర్మెన్ కుంభం రమేష్ రెడ్డి,నాయకులు ఆత్మకూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం/టేకుమట్ల:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మండలంలోని బోర్నపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు డ్యాగరి మల్లేష్ తల్లి డ్యాగరి కొమురమ్మ బుధవారం ఉదయం అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ వెళ్ళి మృతురాలు పార్థీవ దేహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం వారు మాట్లాడుతూ మృతురాలు కుటుంబ సభ్యులు ఎవరూ అధైర్య పడొద్దని భరోసా కల్పించారు. మృతురాలు కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నేరెళ్ల రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి దాసారపు సదానందం, మండల కాంగ్రెస్ పార్టీ కోశాధికారి శాస్త్రాల కిరణ్, మండల నాయకులు బండ రఘోత్తంరెడ్డి, అందె కుమార్, గడ్డం నరసయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నేతల అరెస్టులను ఖండిస్తునాం

ప్రజాపక్షం/వాజేడు: కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ, జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ అన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమీషనర్‌ను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదని, ఇలాంటి ఘటనలు మళ్ళీ పునరావృతం కాకుడదని లేని పక్షంలో దేశవ్యాప్తంగా దశలవారీ ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గౌరరాపు సర్వేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## గుంతలమయంగా మారిన 163 జాతీయ రహదారి

ప్రజాపక్షం/గోవిందరావుపేట: పసర గ్రామంలోని అభ్యుదయ కాలనీ యూటర్న్ సమీపంలో 163 జాతీయ రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో ప్రమాదకర గుంతలు ఏర్పడినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై 11వ వార్డు సభ్యుడు ముప్వ భాను ప్రకాష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక లారీల రాకపోకలతో రహదారికి నష్టం ప్ర తిరోజు పెద్ద సంఖ్యలో ఇసుక లారీలు రాకపోకలు సాగిస్తుండటతో 163 జాతీయ ర హదారిపై పలు ప్రాంతాల్లో రోడ్డు దెబ్బతింటోందని ఆయన పేర్కొన్నారు. ప్రజ ల భద్రతను దృష్టిలో ఉంచుకు ని అభ్యుద య కాలనీ యూటర్న్ వద్ద ఉన్న గుంత ల ను తక్షణమే పూడ్చి రహదారిని ప్ర మాదరహితంగా మార్చేందుకు సంబంధిత జాతీ య రహదారి అధికారులు చర్య లు చేపట్టాలని ముప్వభాను ప్రకాష్ కోరారు.

## ధర్మారం ఇసుక క్వారీలను తక్షణమే నిలిపివేయాలి

ప్రజాపక్షం/వాజేడు: మండలంలోని లింగాపేట ధర్మారం గ్రామాల పరిధిలో పట్టా భూముల్లో నిర్వహిస్తున్న ఇసుక తవ్వకాలను తక్షణమే నిలిపివేసి, సమగ్ర విచారణ చేపట్టాలని టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెనుమల్ల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. రెవెన్యూ సర్వేలో ప ట్టా భూములు ఒడ్డు ప్రాంతాలకు సంబంధించిన వివరాలను సక్రమంగా పరిశీలించకుండా ఇసుక తవ్వకాలకు అనుకూలంగా చూపించారని పేర్కొన్నారు ఇసుక తవ్వకాలు కొనసాగడం వల్ల భూగర్భ జలాల మట్టం పడిపోయే అవకాశం ఉందని ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లడంతో పాటు అక్రమాలకు అవకాశం ఏర్పడుతోందని ఆయ న ఆరోపించారు ఇసుక తవ్వకాలకు సంబం ధించిన భూములపై రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను నిర్ధారించే వరకు లింగాపేట,ధర్మారం ఇసుక క్వారీలను తక్షణమే నిలిపివేయాలని వినతిపత్రం అందజేశారు.

# స్వప్న పోటీ చేస్తే.. నేనూ పోటీ చేస్తా!




ప్రజాపక్షం/నెక్కొండ : తెలంగాణ ఉద్యమ సమయంలో నెక్కొండ ప్రాంతంలో ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఇద్దరి పేర్లు ఇప్పుడు మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రమేష్‌కు సంబంధించిన సోషల్ మీడియా పోస్టు నెక్కొండతో పాటు నర్సంపేట నియోజక వర్గ రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో కలిసి పనిచేసిన పెద్ది స్వప్న అనంతరం నర్సంపేట మాజీ ఎంఎల్ఏ పెద్ది సుదర్శన్ రెడ్డిని వివాహం చేసుకున్నారు. దీనితో ఆమె రాజకీయ ప్రస్థానం కూడా ప్రత్యేక గుర్తింపు పొందింది. నల్లబెల్లి మండలం జడ్పిటిసిగా, జడ్పి ఫ్లోర్‌లీడర్‌గా ఇదిలా ఉండగా...ఉద్యమ కాలం నుండి తనకు స్వప్నతో ఉన్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ నెక్కొండకు చెందిన ఈదునూరి రమేష్ సోషల్ మీడియాలో చేసిన పోస్టు ఇప్పుడు చర్చకు దారితీసింది. 'స్వప్న ఎక్కడైనా ఎంఎల్ఏగా పోటీ చేస్తే..నేను కూడా అక్కడి నుండే పోటీ చేస్తాను. అసలు ఈ పోస్టు వెనుక ఉద్దేశ్యం ఏమిటి? రాబోయే రోజుల్లో రమేష్ రాజకీయంగా ఏదైనా నిర్ణయం తీసుకోబోతున్నారా? స్వప్న రాజకీయ భవిష్యత్తుపై ఈ వ్యాఖ్యలకు ఏమైనా సంబంధం ఉందా? అనే చర్చ నెక్కొండలో మొదలైంది. అయితే ఇది ప్రస్తుతం సోషల్ మీడియా వ్యాఖ్యగానే ఉండగా, దీనిని రాజకీయ ప్రకటనగా భావించాల్సిన అవసరం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఉద్యమంలో కలిసి నడిచిన ఇద్దరి పేర్లు ఇప్పుడు రాజకీయ భవిష్యత్తుతో ముడిపడి వినిపిస్తుండ దంతో "ఉద్యమ సహచరులు..రాజకీయ ప్రత్యర్థులా?" అన్న ఆసక్తికర చర్చ నెక్కొండ రాజకీయ వర్గాల్లో సాగుతుంది. ఒక దశలో రమేష్‌కు కొందరు ఫోన్ కాల్స్ చేసి బెదిరిస్తున్న సమాచారం. తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన తాను అన్ని అర్హతలు ఉన్న ఎలాంటి ఉద్యోగం పొందక జీవితాన్ని మొత్తం విచ్ఛిన్నం చేసుకున్నానని రమేష్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# మృతి చెందిన కుటుంబానికి బీమా పరిహారం అందజేత

### రూ.9.89 లక్షల చెక్కు అందజేత
### 2039 వరకు నెలకు రూ4.500 పెన్షన్

ప్రజాపక్షం/గూడూరు : గూడూరు మండలం తాల్లపట్టి తండాకు చెందిన దారావత వీరన్న కుటుంబానికి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ అండగా నిలిచింది. సుమారు తొమ్మిది నెలల క్రితం సంవత్సరానికి రూ 30 వేల ప్రీమియంతో వీరన్న శ్రీరామ్ లైఫ్ పాలసీ తీసుకున్నారు. అయితే ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన దురదృష్టవశాత్తు మృతి చెందడంతో పాలసీ నిబంధనల ప్రకారం కుటుంబానికి బీమా పరిహారం అందజేశారు.వీరన్న పాలసీకి నామినీగా ఉన్న దారావత్ మౌనికకు రూ 9.89.684 విలువైన చెక్కును గూడూరు మండల మాజీ ఎంపిపి నూనవత్ రమేష్ నాయక్ వరంగల్ జోనల్ మేనేజర్ సతీష్ చేతుల మీదగా బుధవారం అందజేశారు. అంతేకాకుండా 2039 ఆగష్టు వరకు ప్రతి నెల రూ 4500 చొప్పున పెన్షన్ అందించనున్నట్లు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు తెలిపారు. మొత్తంగా వీరన్న కటుంబానికి రూ 17.60 లక్షల బీమా ప్రయోజనం అందుతున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. తక్కువ కాలంలోనే పాలసీదారుడు మృతి చెందినప్పటికీ కటుంబానికి బీమా రక్షణ అందడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతి కుటుంబం భవిష్యత్ ఆర్థిక భద్రత కోసం జీవిత బీమా పాలసీలను సద్వినియోగం చేసేకోవాలని ఈసందర్బంగా అధికారులు సూచించారు. ఈకార్యక్రమంలో మహబూబాబాద్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ శరత్ కుమార్ డివోలు రమేష్ బాలు సేల్స్ ఆఫీసర్ కొర్ర నవీన్ బీడిఎం రమేష్ బ్రాంచ్ డివోలు ఎస్ఓలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌జిఎఫ్ అండర్ 14 క్రికెట్‌కు బాదావత్ విద్యశ్రీ



ప్రజాపక్షం/మహబూబాబాద్ : ములుగు జిల్లాలో జాకా రం పోలీస్ ట్రైనింగ్ సెంటర్ లో జరిగిన సెలక్షన్స్ లో ఎస్జీఎఫ్ మహిళల క్రికెట్ పోటీలకు మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బొద్దుగొండ గ్రామానికి చెందిన బాదావత్ విద్య శ్రీ ఎంపికైనట్లు మహబూబాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు బి అజయ్ సారథి రెడ్డి తెలిపారు. త్వరలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఎస్ జి ఎఫ్ టోర్నమెంట్స్ ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి మహిళల క్రికెట్ కు విద్య శ్రీ ఆడబోతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంతోమంది జిల్లాస్థాయి క్రీడాకారులను ఈ ప్రాంతం నుంచి జిల్లా స్థాయికి రాష్ట్రస్థాయికి జాతీయ స్థాయికి పంపిస్తున్నట్లు బి అజయ్ సారథి రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంలో సమ్మర్ కోచింగ్ క్రికెట్ క్యాంపు ద్వారా ఎంతో మంది విద్యార్థులకు క్రికెట్ మెలుకువలు నేర్పించి వారిని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బి అజయ్ సారథి రెడ్డి విద్యా శ్రీని అభినందించారు. రాబోవు టోర్నమెంట్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎస్ జి ఎఫ్ కు విద్య శ్రీ ఎన్నిక కావడం పట్ల మహబూబాబాద్ జిల్లా క్రికెట్ చీఫ్ కోచ్ మెతుకు కుమార్, సహాయ కోచ్ తోట వినయ్ కుమార్, సహాయకులు బి సాత్విక్ రెడ్డి, పిట్టల రావణ్ హర్షం వెలిబుచ్చారు.

# శాస్త్రీయ దృక్పథమే మానవాళి మనగడకు దిక్సూచి

ప్రజాపక్షం/నర్సంపేట : శాస్త్రీయ దృక్పదమే మానవాళి మనగడకు దిక్సూచని జెవివి రాష్ట్ర నాయకులు శ్రీనాథ్ అన్నారు. జన విజ్ఞాన వేదిక వరంగల్ జిల్లా ఆరవ మహాసభలు నర్సంపేట పట్టణంలో సదాశివ హాల్‌లో నిర్వహించారు. ఈ మహాసభలకి జెవివి జిల్లా అధ్యక్షులు మోతె ఇంద్రసేనారెడ్డి అధ్యక్షత వహించగా మహాసభలకు రాష్ట్ర నాయకులు శ్రీనాథ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. జనవిజ్ఞాన వేదిక ప్రజల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడానికి నిరంతరం కృషి చేస్తున్నదని సైన్స్ సాధించిన ఫలితాలను శాస్త్రజ్ఞులు కనుగొన్నటువంటి వివి ధ శాస్త్రీయ పరిశోధనలను ప్రజల చెంతకు తీసుకొని వెళ్లి ప్రజలలో శాస్త్రీయంగా ఆలోచించే విధంగా శాస్త్రీయ దృక్పథాన్ని ఏర్పరచుకొని నిత్య జీవితాన్ని సౌకర్యవంతంగా చేసుకోవడానికి జనవిజ్ఞాన వేదిక వివిధ చైతన్య కార్యక్రమాలను చేపడుతూ ముందుకు సాగుతుందన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆరవ రాష్ట్ర మహాసభలు నర్సంపేటలో సదాశివని హాల్లో జరగడం నూతన కమిటీని ఎన్నుకొని ఈ నెల 10 11 వ తేదీలలో హైదరాబాదులో జరిగే రాష్ట్ర మహాసభలకు ఎక్కువ మంది ప్రతినిధులు విచ్చేసి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. తదనంతరం ప్రతినిధుల సభలో జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు సుధాకర్ నివేదికను సమర్పించారు. జన విజ్ఞాన వేదిక వరంగల్ జిల్లా నూతన కమిటీ ఏర్పాటు గౌరవ అధ్యక్షులు డాక్టర్ వి.ఎం జయుడు, డాక్టర్ రామకృష్ణ, జిల్లా అధ్యక్షులుగా గుగులోత్ సుధాకర్, జనరల్ సెక్రెటరీగా పాక శ్రీనివాస్, కోశాధికారిగా బూరుగు నవీన్, ఉపాధ్యక్షులుగా వి.మాధవి, వి.శ్యామ్, పాల కుమారస్వామి, సోషల్ యాక్టివిస్ట్ కార్యదర్శులుగా సమ్మెట సురేష్, పెరుమాండ్ల కుమార్ రెడ్డి, ఆర్. సంతోష్ , సబ్ కమిటీల కన్వీనర్లగా ఆరోగ్య విభాగం డాక్టర్ బి.శంకర్, సాంస్కృతిక విభాగం చాగంటి యాకయ్య, సమతా విభాగం వి మాధవి, పర్యావరణ విభాగం మోతె ఇంద్రసేనా రెడ్డి, శాస్త్ర ప్రచారం డాక్టర్ పెండెం భాస్కర్, చెకుముకి కన్వీనర్‌గా ఎండి రాయబోస్, రిటైర్డ్ టీచర్ సామాజిక న్యాయం, సోషల్ మీడియా విభాగం కిష్టయ్య, విద్యా విభాగం మాధవరెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ప్రముఖ వైద్యులు డాక్టర్ వి ఎం జయుడు, డాక్ట ర్ శంకర్, ప్రముఖ ఉపాధ్యాయులు రామకృష్ణ, జెవివి మహిళా నాయకురాలు మాధవి, డాక్టర్ పెండెం భాస్కర్. కిష్టయ్య. కుమార్ రెడ్డి సురేష్ చాగంటి యాకయ్య లు తోపాటు ప్రతినిధుల్లో పాల్గొన్నారు.

## మృతదేహానికి నివాళులర్పించిన బిఆర్ఎస్ నాయకులు

ప్రజాపక్షం/నర్సంపేట : డాక్టర్ వెంకటేశ్వర్లు గౌడ్ అనారోగ్యంతో మృతి చెందారు. బిఆర్ఎస్ నాయకులు డాక్టర్ వెంకటేశ్వర్లు నివాసానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆయన వైద్య వృత్తిలో సేవలను స్మరించుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాయిడి రవీందర్ రెడ్డి, నల్ల మనోహర్ రెడ్డి, తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, మండల శ్రీనివాస్, గిరగాని సొంబయ్య గౌడ్, పెండ్యాల యాదగిరి, రాయరాకుల సారంగం, చుక్క అనిల్, కడారి కుమార్, దోనాల రవి, ముద్దంగుల రవి, బండి ప్రవీణ్, వేల్పుల శ్రీను, నీరటి రంజిత్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని నివాళులర్పించారు.

## ప్రజాపాలన కాదు..ప్రతీకార పాలన

ప్రజాపక్షం/ములుగు: మల్లంపల్లి మండలంలోని అసైండ్ భూములు, ఉమ్మర్‌ఖాన్ భూములు, మైనింగ్ వ్యవహారాలకు సంబంధించిన భూ వ్యవహారాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ద్రోణచారి డిమాండ్ చేశారు. మైనింగ్‌కు సంబంధించిన నిబంధనలు పాటించారా లేదా అనే అంశంపై అధికారికంగా సర్వే నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. ప్రభుత్వ భూములు లేదా పేదలకు చెందాల్సిన భూములు ఉన్నట్లు తేలితే చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసి అర్హులైన పేదలకు అందించాలని అన్నారు. కేవలం కెసిఆర్‌కు సంబంధించిన భూములపైనే దృష్టి సారించకుండా మల్లంపల్లి మండలంలోని అన్ని మైనింగ్ భూవ్యవహారాలపై సమగ్ర సర్వే చేపట్టాలని సూచించారు. ప్రజలకు పారదర్శక పాలన కావాలని, రాజకీయ కక్ష సాధింపు చర్యలు కాదని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత మల్లంపల్లి మండలంలో మైనింగ్ వ్యాపారులు అక్రమంగా ఆక్రమించుకున్నట్లు ఆరోపణలు ఉన్న భూములపై సమగ్ర విచారణ, చట్టబద్ధమైన సర్వే నిర్వహిస్తామని ద్రోణచారి తెలిపారు. ప్రభుత్వ భూములు లేదా పేదల భూములు ఆక్రమణలో ఉన్నట్లు తేలితే చట్టప్రకారం స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు తిరిగి అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు."పేదల భూమి పేదలకే..అక్రమ ఆక్రమణలకు తావులేదు" అని ద్రోణచారి పేర్కొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థి పుట్టిన రోజు వేడుకలు

ప్రజాపక్షం/ములుగు: మండలంలోని పత్తిపల్లి గ్రామానికి చెందిన కారం రాజేందర్, శ్రావణి దంపతుల రెండవ కుమారుడు తన పుట్టిన రోజును తాను చదువుకుంటున్న అంగన్‌వాడీ కేంద్రంలో తోటి విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య ఆనందంగా జరుపుకున్నాడు. కేక్ కట్ చేసి చిన్నారులతో కలిసి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించడంతో అంగన్‌వాడీ కేంద్రంలో సందడి నెలకొంది. తమ కుమారుడి పుట్టిన రోజును తన తోటి విద్యార్థుల మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు ముగింపు

ప్రజాపక్షం/గూడూరు : గూడూరు మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అటవీశాఖ రేంజ్ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో విద్యార్థులకు వన్యప్రాణులు అడవులు సంరక్షణపై అవగాహన కల్పించారు. వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన ఉపన్యాసం డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వన్యప్రాణుల సంరక్షణ అడవుల ప్రాధాన్యత పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై తమ ప్రతిభను ప్రదర్శించారు,వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అటవీశాఖ సిబ్బంది విద్యార్థులకు వివరించారు. ప్రకృతి వనరులను పరిరక్షిస్తూ భవిష్యత్ తరాలకు సురక్షితమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్ఓ విచ్చేశ్వరరావు మదనయ్య సుధాకర్ బీట్ అధికారులు అటవీశాఖ సిబ్బంది మహాత్మా జ్యోతిబాపూలే బాలికల కళాశాల ప్రిన్సిపాల్ హిమవతి ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు

## విద్యుత్ కొరత పై వినతి



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** విద్యుత్ కొరత తో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎందుకుంటున్నారు. నిజాంపేట మండలం బచ్చురాజ్ పల్లి గ్రామానికి చెందిన రైతులు బుధవారం నిజాంపేట విద్యుత్ కార్యాలయంలో వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరెంటు అంతరాయంతో పొలాలకు నీరు అందడం లేదన్నారు. గత రెండు రోజులు రాత్రి 12 గంటల నుండి ఉదయం 11 గంటల వరకు కరెంటు సరఫరా ఉండేదని, అదే మాదిరిగా కరెంటు సరఫరా చేయాలను వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు.

## రాష్ట్రస్థాయి బాలికల జూనియర్ కబడ్డీ పోటీల ఎంపిక

**ప్రజాపక్షం/పాపన్నపేట:** కొత్తగూడెంలో నిర్వహించబోయే రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల కబడ్డీ పోటీలలో పాల్గొనదల్చిన బాలికలు అక్టోబర్ 8వ తేదీన మెదక్ గుల్షన్ క్లబ్లో నిర్వహించబోయే ఎంపిక కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా మెదక్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ట్రెజరర్ పి.రవి సూచించారు. ఇందులో పాల్గొనే బాలికలు 20 ఏండ్ల లోపు ఉండాలన్నారు. ఎంపిక గురువారం 10 గంటలకు కొనసాగుతుందని ఇందులో పాల్గొనవలసిన వారు ఆధార్ కార్డుతో హాజరు కావలసిందిగా ఆయన సూచించారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలనపై గ్రామసభ..

ప్రజాపక్షం/బెజ్జంకి : మండల పరిధిలోని దాచారం గ్రామంలో ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) ద్వారా చేపట్టిన పలు అభివృద్ధి పనులపై బుధవారం గ్రామసభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సోషల్ ఆడిట్ అధికారి సురేందర్ హాజరై గ్రామంలో పూర్తయిన ఉపాధి హామీ పనులను పరిశీలించి పనులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ పరిశీలనలో పనులు నిబంధనల ప్రకారం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం సర్పంచ్ బైర మానస రాజేందర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దీటి బాల్నర్సు, పంచాయితీ కార్యదర్శి సురేష్, టీఏ మాధవి, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షునిగా కిషన్

**ప్రజాపక్షం/కొండపాక:** కొండపాక మండలం వెలికట్ట గ్రామ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా అమ్ముల కిషన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంచాల కనకరాములు బుధవారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గ్రామ పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రణీత్ రెడ్డి, తిమ్మారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ కొయ్యడ వెంకటేశం, వివిధ గ్రామాల సర్పంచులు పావని శశిదర్ రెడ్డి, వెలికట్ట గ్రామ సర్పంచ్ మానస సురేందర్, బొమ్మ మల్లయ్య, కొలుపుల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏడుపాయల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

**ప్రజాపక్షం/పాపన్నపేట :** తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైనశ్రీఏడుపాయల వనదుర్గామాతసన్నిధిలో ఈనెల 11(ఆదివారం) నుండి 20(మంగళవారం) వరకు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలునిర్వహిస్తున్నట్లు ఏడు పాయల ఆలయ ఈఓ మఠం వీరేశం బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, 11(ఆదివారం) అమ్మవారు బాలత్రిపుర సుందరిదేవిఅవతారం(ముదురు పసుపు),12న (సోమవారం) శ్రీ గాయత్రి దేవి అవతారం(గులాబి), 13 (మంగళవారం) శ్రీ అన్నపూర్ణదేవిఅవతారం (నీలం), 14 (బుధవారం) శ్రీమహాచండీ (ఆకుపచ్చ), 15న (గురువారం) శ్రీమహా లక్ష్మి(పెస),16(శుక్రవారం) శ్రీ సరస్వతీదేవి (తెలుపు), 17 (శనివారం) శ్రీలలితా త్రిపురసుందరీ దేవి (నారింజ), 18 (ఆదివారం) శ్రీదుర్గా దేవి (ఎరుపు), 19 (సోమవారం) శ్రీ మహిషాసుర మర్ధిని దేవి( మెరూన్), 20(మంగళవారం) శ్రీ రాజరాజేశ్వరీదేవి వన దుర్గాదేవి (పసుపు) అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 15న దుర్గామాతకు బోనాలు,19న సువాసిని పూజ,చండీ హోమం నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. నవరాత్రుల సందర్భంగా ప్రతీ రోజు గోత్రనామార్చన రుసుము రూ.1,116/ లు, నవరాత్రులలో ఒకరోజు పూజ కార్యక్రమంలో పాల్గొనే భక్తులు రూ.251/ చెల్లించి పూజలో పాల్గొనాలని కోరారు. ఈ ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలోహాజరైఅమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన తెలిపారు.



# వెల్దుర్తి పాఠశాలలో అల్పాహార పథకం ప్రారంభం



**ప్రజాపక్షం/వెల్దుర్తి :** మెదక్ జిల్లా వెల్దుర్తి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తిలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విద్యార్థుల అల్పాహార కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. వెల్దుర్తి గ్రామ సర్పంచ్ ఆదర్శ్, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు అల్పాహారం అందించారు. విద్యార్థులకు పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, ఏకాగ్రతతో పాటు విద్యాభ్యాసంలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఆయన అన్నారు ప్రభుత్వం అందిస్తున్న ఈ సదుపాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రావణ్ కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మాధురి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, పాఠశాల ఉపాధ్యాయలు శ్రీనివాసరావు, నర్సింహా రెడ్డి, చార్లెస్, అర్చన, నవనీత, అమూల్య, సునీత, శైలజ, జయసుధ, ఖదీర్ పాషా, విజయ్, రాము వెంకట్ రెడ్డి, ధనరాజ్, ఇతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు

**ప్రజాపక్షం / మెదక్ :** మెదక్ జిల్లా హవేలీఘన్‌పూర్ మండలంలోని మద్దుల్ వాయి, ఫరీద్‌పూర్ గ్రామాలలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకి అవగాహన కార్యక్రమం, క్షేత్ర ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి బాల్ రెడ్డి మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం వల్ల భూసారం దెబ్బతింటుందని, ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో కీలకమైన ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, పంచగవ్య, దశపర్ణి కషాయం, అగ్నాస్త్రం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం తయారీ విధానాన్ని రైతులకు వివరించడం జరిగింది. రైతులు సేంద్రియ పద్ధతులను పాటించడం ద్వారా పురుగు, తెగుళ్లను సమర్థవంతంగా నివారించవచ్చని, భూమి సారవంతంగా మారుతుందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉండడం వల్ల యాసంగి సిజన్‌లో ఆరుతడి పంటలు మొక్కజొన్న, వేరుశనగ, కంది, పెసర, మినుము, జొన్న, కుసుమలు లాంటి పంటలు వెసుకోవలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఏఈఓ ఝాన్సీ, నాచురల్ ఫార్మింగ్ ఇన్స్పెక్టర్ ప్రశాంత్, సీఆర్పీలు నవనీత, సింధూజ, మానస, మౌనిక, సర్పంచ్,ఉప సర్పంచ్, రైతు సోదరులు పాల్గొన్నారు.



# మనోహరాబాద్ మండల జనరల్ సెక్రటరీగా నరేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ మనోహరాబాద్ మండల జనరల్ సెక్రటరీగా నరేందర్ రెడ్డి నియమితులయ్యారు.ఇందులో భాగంగా మనోహరాబాద్ మండలంలోని శుభం గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర నాయకులు చిట్కుల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నరేందర్ రెడ్డికి అధికారికంగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో ఘనంగా సత్కరించారు. పార్టీ అధిష్ఠానం తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని నాయకులు సూచించారు. మండలంలోని గ్రామాల్లో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, కాంగ్రెస్ పార్టీ విధానాలు మరియు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి కార్యకర్త సమష్టిగా పని చేయాలని సూచించారు. తనను మండల జనరల్ సెక్రటరీగా నియమించిన పార్టీ నాయకత్వానికి నరేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.పార్టీ నాయకులు,కార్యకర్తల సహకారంతో మనోహరాబాద్ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జూపల్లి మల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకల నరసింహ,సర్పంచ్ మద్దూరి నవ్య నాగరాజ్ గౌడ్, ఉప సర్పంచ్ వీరబోయిన ప్రవీణ్ కుమార్ ముదిరాజ్, మండల మైనారిటీ అధ్యక్షులు సొసైటీ డైరెక్టర్ జావిద్ పాష, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు జోన్నోజి రంగాచారి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు తాడేపు మహేందర్, మండల ఎస్సీ సెల్ చైర్మన్ మేడ్చల్ రామస్వామి, నాయకులు వెంకటేష్, చంద్రయ్య, పెంటయ్య, మండల ముఖ్య కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లారెడ్డి హాస్పిటల్ ఉచిత హెల్త్ క్యాంప్



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల పరిధిలోని షౌకత్ పల్లి గ్రామం లో లయన్స్ క్లబ్ అఫ్ రామాయంపేట ఆధ్వర్యంలో మల్లారెడ్డి హాస్పిటల్ వారిచే ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ క్యాంపులో ఈసీజీ బీపీ వైద్య పరీక్షలు చేసి రోగులకు ఉచితంగా మందులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో 75మంది వైద్య పరీక్షలు చేసుకున్నారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం స్థానిక ఎస్ఐ రాజేష్, ఆన్‌లైన్ మోసం గురించి ప్రజలకు అవగహన కల్పించారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ సునీత బాబు, ఉపసర్పంచ్ సూర రాములు, మాజీ ఉప సర్పంచ్ రాజు లయన్స్ క్లబ్ అధ్యక్షులు జీడి తిరుపతి సెక్రటరీ భూర్గుపల్లి శివకుమార్ చికోటి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డిపై సోషల్ మీడియాలో తప్పడు ప్రచారంపై ఎస్పికి ఫిర్యాదు



**ప్రజాపక్షం/శివ్వంపేట :** సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబీకులపై సోషల్ మీడియాలో ముఖ్యంగా ఓ యూట్యూబ్ చానల్‌లో అసత్య, నిరాధార వార్తలు ప్రచారం చేస్తున్నారని జిల్లా గ్రంధాలయ ఛైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, జిల్లా అధికారప్రతినిధి బండారి గంగాధర్ ఆరోపించారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో సదరు యూట్యూబ్ చానల్ వాస్తవాలను పరిశీలించకుండా ప్రజలను తప్పుతోవ పట్టించేవిధంగా సీఎం ప్రతిష్ఠకు భంగం కలిగించేవిధంగా వీడియోలు ప్రసారం చేస్తుందని ఫిర్యాదులోపేర్కొన్నారు. పరువుప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్న వారిపై చట్టరిత్య చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్, మాచునూరి శ్రీశైలంయాదవ్, కొండి దుర్గేష్, బేస్త చిరంజీవులు, కుమ్మరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కోసం అన్నదాతల ఆందోళన

**ప్రజాపక్షం/గజ్వేల్ :** నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ అహ్మదీపూర్ చౌరస్తాలో బుధవారం అహ్మదీపూర్, దిలాల్పూర్, శేరిపల్లి గ్రామాల రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ వారికి మద్దతు ప్రకటిస్తూ మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగుకు నిరంతర విద్యుత్ అందిస్తామని చెప్పిన ప్రభుత్వం, ప్రస్తుతం కరెంట్ విషయంలో ఇబ్బందులకు గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటలు చేతికొచ్చే సమయంలో విద్యుత్ కోతలతో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం నెలకొందని విమర్శించారు. హామీలు ఇవ్వడం కాకుండా12 గంటల త్రి పేస్ నాణ్యమైన విద్యుత్ అందించి ఆచరణలో చూపించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఎలినో ప్రభావం, మరోవైపు వర్షాలు లేక రైతులు ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. రైతుల శ్రేయస్సు కోసం గత ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల్లో మోటార్లు నడపకుండా నీటిని వదిలేయడం సిగ్గుచేటని నిలదీశారు. విద్యుత్ ఏఈ సత్యం ధర్నా దగ్గరకు చేరుకోవడంతోపాటు అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో నేతలు మద్ది రాజిరెడ్డి, రవీందర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, బ్యాగారి ప్రభాకర్, శ్రీనివాస్ రెడ్డి, చాడా శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## దొరికిన ఫోన్‌ను అప్పగింత



**ప్రజాపక్షం/చేర్యాల:** రోడ్డుపై దొరికిన మొబైల్ ఫోన్‌ను చేర్యాల పోలీసులకు అప్పగించి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ మరో సారి తన నిజాయితీని చాటుకున్నారు. చేర్యాల పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి పోగొట్టుకున్న మొబైల్ ఫోన్. చేర్యాల తహశీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్‌కు ఓ మొబైల్ ఫోన్ దొరకడంతో, ఫోన్‌ను చేర్యాల పోలీస్ స్టేషన్‌కు తీసుకవెళ్లి చేర్యాల ఎఎస్ఐ సదాశివ రావుకు అప్పగించారు. పోన్‌లోని సమాచారంతో పోలీసులు చేర్యాల పరిధిలో వేచరేణి గ్రామానికి చెందిన వ్యక్తి చామంతల సుధాకర్‌గా పోలీసులు గుర్తించారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను బాదితునికి పోలీసులు అప్పగించారు. గతంలోను ధూల్మిట్ట మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన గద్దల స్నేహకు సంబందించిన 50 వేల పోన్‌ను సమాచారం అందించి, ఎస్ఐ గూడ అపూర్వరెడ్డితో కలసి అందె అశోక్ ఫోన్ అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ నేత అందె అశోక్‌ను చేర్యాల పోలీసులు, పలువురు అభినందించారు.

## బ్యాంకు సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### టిజిబి మేనేజర్ రాజేష్ కుమార్



**ప్రజా పక్షం/ రేగోడు:** మండలం జగిర్యాలలో ఏర్పాటు చేసిన బ్యాంకు సేవా కేంద్రం రేగోడు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులు బ్యాంకు మిత్ర సేవా సద్వినియోగం రూ చేసుకోవాలని రేగోడు టిజిబి మేనేజర్ రాజేష్ కుమార్ అన్నారు బుధవారం రేగోడు మండలంలోని జగిత్యాల గ్రామంలో బ్యాంకు మిత్ర సేవా కేంద్రాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు సేవలను నూతన అకౌంట్లోను సేవా కేంద్రం ద్వారా చేసుకోవచ్చని తెలిపారు ఈ కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ భూమయ్య ఐరిక్స్ మేనేజర్ అశోక్ బ్యాంక్ మిత్ర నిర్వాహకులు చైతన్య మహేష్ తదితరులు ఉన్నారు.

## ఎస్సీసెల్ మండలాధ్యక్షుడుగా బోయిని ప్రశాంత్..

**ప్రజాపక్షం/బెజ్జంకి :** కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షులుగా మండల పరిధిలోని గుగ్గిళ్ళ గ్రామానికి చెందిన బోయిని ప్రశాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తప్పెట శంకర్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సంధర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో అవకాశం కల్పించిన రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మెన్ ఎంఎల్‌ఏ డా.కవ్వంపల్లి సత్యనారాయణకు, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డికి,జిల్లా ఉపాధ్యక్షులు పోతిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి,ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బండమీది తిరుపతికి,మండల ఏఎంసీ చైర్మెన్ పులి కృష్ణకు,ఫ్యాక్స్ చైర్మెన్ దామోదర్‌కు, పార్టీ మండలాధ్యక్షులు శ్రీనివాస్‌కు,మాజీ మండలాధ్యక్షులు రత్నాకర్ రెడ్డికి,మండల నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి



**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత పటిష్టం చేసేందుకు మనోహరాబాద్,తూప్రాన్ మండలాల గ్రామ,మండల కమిటీలను ఏర్పాటు చేశారు.పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఆదేశాల మేరకు మనోహరాబాద్ మండల కేంద్రం లోని శుభం గార్డెన్‌లో బుధవారం ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర నాయకులు చిట్కుల మహిపాల్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జూపల్లి మల్లారెడ్డి ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు పాల్గొన్నారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పార్టీకి కార్యకర్తలే బలమని, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేస్తే కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు భాస్కర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకల నరసింహా, మండల మైనార్టీ అధ్యక్షులు జావేద్ పాషా, కళ్ళకల్ సర్పంచ్ మద్దూరి నవ్య నాగరాజ్ గౌడ్, ఉప సర్పంచ్ వీరబోయిన ప్రవీణ్ కుమార్ ముదిరాజ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు తాడిప మహేందర్, మండల ఎస్సీ సెల్ చైర్మన్ మేడ్చల్ రామస్వామి, ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ, మండల కమిటీల సభ్యులు పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

## వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



**ప్రజాపక్షం /అల్లాదుర్గం :** మండల సర్వసభ్య సమావేశం బుధవారం అల్లాదుర్గం మండల సమైక్య కార్యాలయంలో జిల్లా కోఆపరేటివ్ అధికారి, మండల ప్రత్యేక అధికారి పద్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. సందర్భంగా పలు శాఖల పనితీరుపై పలు గ్రామాల సర్పంచులు సమస్యలపై అధికారులను నిలదీశారు. అంగన్వాడీ సెంటర్ల పనితీరు అస్తవ్యస్తంగా ఉందని ప్రభుత్వం నుండి చిన్నారులకు అందించే సరుకులను అంగన్వాడి కార్యాలయాల్లో పెట్టుకోకుండా సిబ్బంది ఇండ్లలో పెట్టుకోవడం ఏమిటని బాలింతలకు చిన్న పిల్లలకు సెంటర్లలో భోజనం గుడ్లు పెట్టకుండా ఇంటికి పంపడం ఏమిటని మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు నరసింహారెడ్డి ప్రశ్నించారు. అంగన్వాడి కేంద్రాల పనితీరు మెరుగుపడేలా.. చూడాలని పలువురు సర్పంచులు అధికారులకు విన్నవించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలను తీర్చాలని పలువురు సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఆయా గ్రామాల్లో తరచు ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతున్నాయని నో వోల్టేజి సమస్యతో మోటార్లు నడవక సరిగ్గా కరెంటు లేక చేతికొచ్చిన పంట పొలాలు నీరందక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గడి పెద్దాపూర్, అల్లాదుర్గంలో పాత ఇనుప స్తంభాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటి స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని సర్పంచులు మద్దూరి సౌమ్య, హరికృష్ణ కోరారు. ఎంపీడీవో వేద ప్రకాశ్ రెడ్డి, మిషన్ భగీరథ డిఈ భాస్కర్ రెడ్డి, మాట్లాడుతూ రాబోయే రోజులలో గ్రామాలలో మంచినీటి ఎద్దడి రాకుండా స్థానిక సర్పంచులు ఎక్కువ నీటి వసతి ఉన్న బోరు బావుల నుండి మంచినీటి ట్యాంకులకు లైన్ వేసుకోవాలని సింగల్ ఫేస్ మోటర్ ఉన్న బోర్ బావి దగ్గర నీటిని వృధా పోనివ్వకుండా తగు జాగ్రత్తలు తీసుకొని బోరు బావుల చుట్టూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మల్లయ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ సారిక, డాక్టర్ అశ్విని, సర్పంచులు నరసింహారెడ్డి, గోపాల్ రెడ్డి, రవికుమార్, శశిధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కవిత, మద్దూరి సౌమ్య, రమ్య, రేణుక, హరికృష్ణ, మన్యా నాయక్, శంకర్ నాయక్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

## రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీసహా ఇండియాకూటమి ఎంపి అరెస్టు అప్రజాస్వామికం

**ప్రజాపక్షం / హుస్నాబాద్ :**దేశంలో ఓట్ల తొలగింపు , సర్ ప్రక్రియపై జరిగిన అక్రమాలను అవకతవకలను ప్రశ్నించిన లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తో పాటు ఇండియా కూటమి నేతలను ఆరెస్టు అప్రజాస్వామికమని ఓట్లు తొలగింపును ప్రశ్నింస్తే ఆరేస్టులా అంటు కేంద్ర ప్రభుత్వ వైకరిని తీవ్రంగా ఖండించిన తెలంగాణ బి సి రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు. కాంగ్రెస్ పార్టీ కేంద్ర కమీటి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో బాగంగా బుధవారం పట్టణ ఆధ్యక్షుడు వి వి రమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హుస్నాబాద్ పట్టణంలోని గాంధీ చౌరస్తాలో నాయకులతో కలిసి కొద్ది సేపు నిరసన చేపట్టి కేంద్ర ఎన్నిక అధికారి వైకరిని నిరశిస్తునినాదాలు చేశారు. ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో జరిగిన ఓట్లు చోరిపై ప్రజల వైపు నుండి ప్రశ్నిస్తే సమాదానం చెప్ప కుండ అక్రమ ఆరేస్టులు చేయడం ఏమిటని కేంద్ర ప్రభుత్వంను నిలదీశారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా ప్రజలు కేంద్ర ఎన్నికల అధికారిపై తీవ్ర స్థాయిలో నిరసన తెలుపు తున్న ఇంత వరకు అ ఆధికారిని తొలగించ లేదని వెంటనే జ్ఞానేశ్వర్‌కుమార్‌ను తొలగించి ప్రధాని రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి కొమురయ్య, వైస్ చైర్మెన్ చిత్తారి పద్మరవిందర్, సిద్దిపేట జిల్లామాజీ ఆధ్యక్షుడు తూముకుంట నర్సింహారెడ్డి, గ్రంధాలయ మాజీ చైర్మెన్ కేడం లింగ మూర్తి , సహకర సంఘం చైర్మెన్ బొల్లిశెట్టి శివరెడ్డి, మార్కెట్ కమీటి చైర్మెన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మెన్ బంక చందు, కాంగ్రెస్ పార్టీ ఆధ్యక్షుడు వెన్నరాజు, కౌన్సిలర్లు వరప్రసాదు , మంజుల , శోభన్, వైద్యకిరన్, సంపత్‌నాయక్, నాయకులు సత్యనారయణ కొమటి, బిక్కినాయక్, కిష్టస్వామి, రాజు సంపత్ వీరన్న, నగేశ్, రజిత, మనోజ్ మైదం శెట్టి యాదవరెడ్డితో పాటు నాయకులు పాల్గోన్నారు.

## అభివృద్ధి పనులకు శ్రీకారం



**ప్రజాపక్షం / నిజాంపేట్ :** మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు గ్రామాల అభివృద్ధికి సహకరిస్తున్నారని, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అమరసేనారెడ్డి అన్నారు. నిజాంపేట మండలం నార్లపూర్ గ్రామానికి ఎస్సీ సబ్ ప్లాన్ కింద 20 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు, డ్రైనేజ్ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. బుధవారం సర్పంచ్ బత్తుల స్వప్న తో కలసి పనులు ప్రారంభించారు. అన్ని విధాల గ్రామాలకు సహకరిస్తున్న ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో నార్లపూర్ గ్రామాన్ని మండలంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఉపసర్పంచ్ సంజీవులు నాగరాజు, బాలయ్య, మధు, శ్రీనివాస్, వార్డు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు నీడ, నీరు కల్పించండి



**ప్రజాపక్షం/పాపన్నపేట :** ఉపాధి హామీ కూలీలకు ఎండ దెబ్బ తగలకుండా టెంటు ఏర్పాటు చేసి త్రాగునీరును అందుబాటులో ఉంచాలని మెదక్ జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ) యాదయ్య అన్నారు. మండల పరిధిలోని నార్సింగి గ్రామంలో బుధవారం మెదక్ జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో డ్రైనేజీ, వీధి దీపాలు, త్రాగునీటిని సందర్శించారు. గ్రామంలో గల్లీలలో తిరుగుతూ ఇంటింటికి ఇంకుడు గుంతలు తప్పని సరిగా ఉండాలని గ్రామ సర్పంచ్ మల్లేశం, సెక్రటరీ వెంకటేశం ను ఆదేశించారు. జాతీయ ఉపాధి హామీ పథకం పని వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. వారికి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కూలీలు మాట్లాడుతూ ఉపాధి హామీ పని వద్ద నీడ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. కూలీలకు కావలసిన టెంట్లు, నీరు అందించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేష్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ రవి, వార్డుమెంబర్లు కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## పంటలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి: రాగి రాములు

**ప్రజాపక్షం/రామాయంపేట:** రామాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలో తీవ్ర విద్యుత్ కోతలు, లోవోల్టేజ్ సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పంటలు చేతికొచ్చే కీలక సమయంలో మరో 20 రోజులు నిరంతర విద్యుత్ సరఫరా అవసరమని తెలిపారు. రైతులతో కలిసి సబ్‌స్టేషన్‌ను సందర్శించి ఏఈ తిరుపతిరెడ్డికి సమస్యను వివరించారు. లోవోల్టేజ్ కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకటి, రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఏఈ హామీ ఇచ్చారని రాగి రాములు తెలిపారు. సమస్య పరిష్కారం కాకపోతే సబ్‌స్టేషన్ ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి, మెంగర్తి రంగయ్య, రాగి అనిల్‌కుమార్, సున్నం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో 151 సెల్‌పోన్‌లు రికవరీ

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట పోలీస్‌కమిషనరేట్‌లో 151 సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ రశ్మీపేరుమాల్ తెలిపారు. సిద్దిపేట పోలీసులు పోగొట్టుకున్న చరవాణిల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సిఈఐఆర్ పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగించి 151 చరవాణి లను రికవరీ చేసి బాధితులకు అందచేసినట్లు సిపి వెల్లడించారు. చరవాణి పోగొట్టుకుంటే ఆందోళన చెందవద్దని సిఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని సిపి అన్నారు. గురువారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోగొట్టుకున్న 151 చరవాణిలు (16 లక్షల విలువ గల ఫోన్లను) స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా సిపి రశ్మీ పెరుమాళ్ మాట్లాడుతూ... తమ చరవాణి ఎలా పోగొట్టుకున్నారు అని అడిగి తెలుసుకున్నారు. కావున ప్రజలు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పోయిన సెల్ ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. పోయిన మొబైల్ ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి సిఈఐఆర్ వెబ్సైట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సిఈఐఆర్ వెబ్సైట్లో ప్రజలు సంబంధిత పోలీస్ స్టేషన్ లో వారి వివరాలను నమోదు చేసుకుంటే మొబైల్స్ ని ఈ పోర్టల్ ద్వారా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయడం జరగిందని అన్నారు. ఈ సందర్భంగా మొబైల్ పోగొట్టుకున్న వారు, ఫోన్ దొరికినందుకు చాలా సంతోషం వ్యక్తం చేశారు, సిపి రష్మీ పెరుమాళ్, ఐపిఎస్ గారికి ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం 670 చరవాణిల రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగిందని అన్నారు. సిఈఐఆర్ ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరికైనా ఎక్కడైనా చరవాణి దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్లో గాని లేదా ఆ నెంబర్ వారికి ఫోన్ చేసి వారికి అప్పగించాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్లు రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన సిఈఐఆర్ బృందం, ఇన్స్పెక్టర్ మొగిలి, ఆర్ ఎస్ఐ నిరంజన్, కానిస్టేబుల్ రమేష్ ,రాజి రెడ్డి , హరి క్రిష్ణ, స్వామి , శ్రీకాంత్ మరియు సిఈఐఆర్ కానిస్టేబుల్ లను సిపి అభినందించారు.

ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్ గారు, అదనపు డీసీపీ ఎఆర్ సుభాష్ చంద్రబోస్ గారు, సిద్దిపేట ఏసిపి రవీందర్ , గజ్వేల్ ఏసిపి నర్సింలు, హుస్నాబాద్ ఏసిపి సదానందం, ఇన్స్పెక్టర్లు , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

